

# కిడ్నీ సదుపాయాలు

ఎ. గోపాలకృష్ణ

"గీ ఉత్తర మేందో కాస్త సదివి యినిపిస్తవు మల్ల!"

"దా న్దేముంది ఈరయ్యా! ఇట్టా దే!" పరిశీలనగా చూశా డా ఉత్తరాన్ని దొర.

"గీ ఉత్తరాన్ని నీ కూన రాసినట్టున్నాడు. సదవమంటివా?"

"అందుకనే గదా నీ కిస్తిని. జల్ది సదువు భయ్యా!"

"నీ కూన అడ సేమంగా ఉన్నడంట. రేపు ఉదయాన్నే ఈడకు వస్తమని రాసిండు. సమజ్జయినదా!"

విషయం తెలిసిన వీరయ్య గుండెల్లో అనందం పెల్లుబికింది. ఒక్కగా నొక్క కొడుకు ప్రభాకర్. 'తాను' పేదరికానికి వారసుడైనా, తన కొడుకు కాకూడదని వీరయ్య ఆశ. అందుకే తన బతుకును తాకట్టు పెట్టి మరీ 'డాక్టరు'ను చేశాడు ప్రభాకర్.

అయిదేళ్ల తర్వాత తన కొడుకుని చూడబోతున్నా ననే ఉత్సాహం అతన్ని నిలువనీయకుండా చేస్తోంది.

* * *

అపూర్వా హాస్పిటల్!

సిటీలో పేరున్న హాస్పిటల్ అది.

డాక్టర్ ప్రభాకర్!

దయ, జాలి, కరుణ - వీటి కన్నిటికీ అర్థం ఒకటే.

వీటన్నింటికీ మారు పేరు అతడే! సిటీలో అతన్ని మెచ్చుకుంటా రందరూ.

అతని మనస్సును మాత్రం ఎవరూ అంచనా వేయలేరు.

రాత్రి 8 గంటలు.

స్టాఫ్ మీటింగ్ మొదలైంది.

"హలో ఫ్రెండ్స్! నే చెప్పినదంతా గుర్తుంది కదా! నే తిరిగొచ్చేసరికి అంతా సిద్ధం చెయ్యండి."

"ఈ ఎగుమతితో మనం అనుకున్నది పూర్తి అవుతుంది, బాస్!"

"అవును. అదే కదా మన లక్ష్యం. ఎలాగైనా ఓ పది శాల్తీలను తీసుకురావటానికి ప్రయత్నం చేస్తాను."

"ఓకే బాస్! మేం ఉంటాం."

* * *

తారు రోడ్డు దిగి లూప్‌లైన్‌లోకి ప్రవేశించింది కారు. చెలరేగుతున్న ధూళితో మొత్తం కారు రంగే మారిపోతోంది.

ప్రభాకర్‌లో చాలా ఏళ్ల తర్వాత తన తల్లిదండ్రులను చూడబోతున్నా ననే ఊహ రూపుదిద్దుకుంటోంది. కారు కిటికీలు తెరిచాడు. చుట్టూ పచ్చని పొలాలు, కొబ్బరి చెట్లూ, సర్వే తోటలు - ఎంతో ఆహ్లాదకరంగా ఉం దా వాతావరణం.

నగరానికి అలవాటుపడిన అతని జీవితం

ఇలాంటి ప్రదేశాల్లో సర్దుకోవటం కాని పనే అయినా, ఆ క్షణాల్ని మళ్లీ మళ్లీ నెమరువేసుకుంటోంది. ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తున్న అతని మనస్సు. నెమ్మదిగా వీస్తున్న చల్లని గాలిని పీల్చుకుంటూ, చేసుకుంటూ, ముందుకు దూసుకుపోతోంది కారు. ఇంకా నాలుగు కిలోమీటర్లుంది తను చేరవలసిన గమ్యం. స్టీరియోలోనుంచి వస్తున్న సన్నని రాగాలాపన తన హృదయాన్ని స్పందింపచేస్తుంటే, ఊరు దగ్గరవుతున్న కొద్దీ తల్లిదండ్రుల మమతానురాగాల ప్రతిస్పందనలు మనస్సును కుదిపేస్తున్నాయి. ఊరి పొలిమేరల్లోకి ప్రవేశించింది కారు.

గొల్లుమంటూ వెంటపడ్డారు ఊరి పిల్లలంతా. వాళ్ల ఊళ్లోకి కారు రావటం అదే మొదటిసారేమో - ఉప్పొంగిపోతున్న ఉత్సాహాన్ని వెల్లుబికించే వస్తువే అయింది ఈ 'కారు'. పిల్ల మూకల్ని అదుపు చేసుకుంటూ మెల్లగా ఆగింది కారు.

* * *

పలకరింపులే పక్షుల కిలకిలారావా లయ్యాయి.

ఆత్మీయతలూ, మమతానురాగాలే తొలకరి జల్లులై పులకింపజేశాయి. ద్వేషాలూ, పట్టింపుల మధ్య కకావికలమైన సిటీ వాతావరణం, ఆ పల్లె ప్రశాంతతముందు దిగదుడుపయింది.

ప్రభాకర్ మనస్సు మరింత ఆహ్లాదకరంగా ఉంది.

తను నగరంలో ఒకరి ప్రాణాల్ని ఒకరు బలిగొనటమే చూశాడు కానీ, ఇక్కడ ఒకరికోసం ఒకరు ప్రాణాల్ని సైతం త్యాగం చేసుకోవటం చూస్తున్నాడు. పల్లె ప్రజల మధ్య గడిపే క్షణాలూ, వారి అమాయకపు మాటలూ తనలో కొత్త అనుభూతుల్ని సంతరింపచేస్తున్నాయి. ఆ పల్లెలో తను గడిపిన ఒక రోజు ఓ క్షణంలా గడిచిపోయింది.

రాత్రి అయింది. అప్పటికే ఊరంతా సద్దుమణిగింది. నులకమంచంపై సేదదీరిన ప్రభాకర్ బుర్రలో ఎన్నో ఆలోచనలు. తెల్లారితే ప్రయాణం. తను వేసుకున్న పథకం ప్రకారం అమ్మా, నాన్నలనీ, మరి ముగ్గురు మగాళ్లని తీసుకెళ్లాలి తనతో. 'ముందు నాన్నగారిని తనతో ప్రయాణానికి ఒప్పించాక, మిగిలిన ముగ్గురినీ తీసుకెళ్లటం కష్టమైన పనేమీ కాదు' అనుకున్నాడు.

అంత తీవ్రమైన ఆలోచనలోనూ, చల్లగా కురుస్తున్న వెన్నెలకు ప్రభాకర్ మరొక్కసారి స్పందించాడు. ఆ స్పందనే మత్తుకు నాందియై అలాగే నిద్రలోకి జారుకున్నాడు.

* * *

'సిటీ' చేరుకుంది కారు.

ప్రభాకర్ బంగళాను సమీపించటానికి ఇంకా అరగంట సమయం పడుతుంది. సిటీలో ప్రాముఖ్యంగల ప్రదేశాలనూ, వింతలూ, విశేషాలనూ కిటికీలోనుంచే చూపించసాగాడు తల్లిదండ్రులకూ, బంధువులకూ ప్రభాకర్.


ఎన్నడూ తాము చూడ[లే]ని ఆకాశహార్మ్యాలనూ, ట్రాఫిక్‌నూ చూస్తూ అపరిమితానందం పొందారు వారంతా! కొద్దిసేపట్లోనే బంగళాను చేరుకుంది కారు.

ముందు ప్రభాకర్ దిగాడు. వెనుకనే తల్లిదండ్రులు. వాళ్ల చూపుల వెనుక ఆశ్చర్యపు నీలినీడలు కమ్ముకుంటున్నాయి. తమ కొడుకు హోదాను, జీవన విధానాన్ని తమ కళ్లారా చూద్దామంటే, వాళ్లకున్న రెండు కళ్లూ చాలటంలేదు. అయినా సర్దుకుంటూనే ఇంద్రభవనంలాంటి ఆ ఇంటిపై రెప్ప వేయకుండా దృష్టి సారించారు. బట్లర్ పిలుపుతో వర్తమానంలోకి వచ్చి, తరువాతి కార్యక్రమానికి ఉపక్రమించారు.

* * *

హాస్పిటల్ ఆఫీస్ గదిలో ప్రభాకర్.

"ఫ్రెండ్స్! ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి కదా! మన అదృష్టవశాత్తూ నలుగుర్ని నా వెంట తేగలిగాను. మన పథకం ప్రకారం ఈ నలుగురితో టార్గెట్ పూర్తి అవుతుంది. అప్పుడు బ్యాంకుల్లో మనకు లక్షలు బ్యాలెన్స్ ఉంటుంది. మన లైఫ్‌కి మరి ఢోకా ఉండదు!"




"సార ఈ డ్రింక్స్ తీసుకోమన్నారు."

"గేంటిది భయ్యా! గంటగంటకీ గిట్ల తాగితే మన తందురుస్తీ కేం టాతది మల్ల?"

"పరవాలేదండీ! చలువచేస్తుంది, తీసుకోండి."

"సరే, జర ఇవ్వు మల్ల!"

ఆ డ్రింక్స్ తాగిన ఐదు నిముషాల్లోనే అక్కడే కూలబడిపోయారంతా! వెంటనే ప్రభాకర్ వచ్చాడు. "వీళ్లని అర్జెంట్ వార్డుకు తీసుకెళ్లండి. ఈలోగా మా అమ్మగారిని స్పెషల్ వెహికల్ మీద మన గెస్ట్‌హౌస్‌కు పంపించేస్తాను."

అర్జంట్ వార్డ్ డోర్స్ లాక్ అయ్యాయి.

ఆపరేషన్ ప్రారంభం అయింది.

ప్రభాకర్ బుర్రలో ఆలోచనలు సుళ్లు తిరుగుతున్నాయి. నాన్న మరి ముగ్గురు బంధువులు - వీళ్ల నలుగురి కిడ్నీలు తీసి ఎగుమతి చేస్తే తన టార్గెట్ పూర్తవుతుంది. దాంతో తను చెప్పలేని ఉన్నత శిఖరాలకు .....

ప్రభాకర్ ఆలోచనలు వికృతరూపం దాలుస్తున్నాయి. తనను పెంచి పోషించిన తల్లిదండ్రులను కిడ్నీ వ్యాపారంలో పావులుగా చేసే నీచ స్థితికి దిగజారింది అతని నైజం.

అతని ఆలోచనలను చెదరగొడుతూ బజర్ మోగింది.

ఆత్రుతగా లేచి వెళ్లాడు ప్రభాకర్.

పాలిపోయిన ముఖాలతో బయటికొచ్చారు కొలీగ్స్.

"ఏమైంది?" అడిగాడు ప్రభాకర్.

"సారీ, ప్రభాకర్! వాళ్ల నలుగురికీ లెఫ్ట్ సైడ్ కిడ్నీలు లేవు. ఇంతకు ముందే ఎవరో తొలగించారు."

ఆ మాట విన్న ప్రభాకర్‌కు పై ప్రాణాలు పైనే పోయాయి.

ఒళ్లంతా చెమటతో తడుస్తోంది.

గుండెల్లో పిడుగు పడినట్టు, కాళ్లకింద భూమి కంపించిపోతున్నట్టు, అధఃపాతాళానికి తాను కూరుకుపోతున్నట్లూ ...

గెస్ట్‌హౌస్‌లో ప్రభాకర్ గుట్టు రట్టయింది. మాతాశ్రీకి విషయం అర్థమైంది. అప్పుడే పోర్టికోలోకి కారొచ్చి ఆగింది. మాతాశ్రీ ఉగ్రురాలై వస్తోంది.

"ఒరేయ్! ఎంత నీచానికి దిగావురా?

"పెంచి పోషించిన తల్లిదండ్రుల్నే మోసం చేస్తావురా?

"నువ్విలా చేస్తావని ముందే తెలిస్తే; మీ నాన్న తన కిడ్నీని అమ్ముకుని ని న్నింతటివాణ్ని చేసేవాడు కాదురా!

"ఒరేయ్! నీ కోసమేరా, నీ చదువుకోసమేరా - నీ పదేళ్ల వయసులో ని న్నింకా పెద్ద చదువులు చదివించాలని మీ నాన్న తన కిడ్నీని అమ్ముకున్నాడు!

"చిన్నప్పటినుంచీ మీ నాన్నతో తిరిగే ఆ ముగ్గురూ కూడా నీ డాక్టర్ చదువుకు డబ్బులు చాలవంటే, తమ కిడ్నీలు కూడా తీయించి అమ్మి నీ చదువుకి సాయం చేశారు. కంచే చేను మేసినట్టు - నువ్వు వాళ్ల ఆశల్ని ఫలింపచేసి, తిరిగి వాళ్లకే అన్యాయం చేయాలనుకున్నావా!

"అయినా కన్న తండ్రి కిడ్నీతో వ్యాపారం చేయాలనుకునే నువ్వు ఒక మనిషివేనా?"

ఆమె మాటలు వింటున్న ప్రభాకర్ సిగ్గుతో కుంచించుకుపోయాడు.

* * *

రాత్రి ఒంటిగంట. బెడ్‌పై ఉన్న నలుగురికీ ఒకేసారి స్పృహ వచ్చింది. కానీ సులువుగా లేవలేకపోతున్నారు. ఒళ్లంతా కత్తులతో చీరేసినట్టు ఒకటే నొప్పి. తమ శరీరంలో ఒక భాగంపై కుట్లు పడినట్టు నలుగురూ ఒకేసారి గ్రహించారు.

"ఏం టిదంతా?" నలుగురికీ ఒకే సందేహం.

మాతాశ్రీ విజృంభించింది - "మన ప్రభాకర్ చేసిన దారుణమయ్యా ఇది! అభిమానంతోనూ, ఆత్మీయతతోనూ మన నిక్కడికి తీసుకురాలా! మన కిడ్నీలతో వ్యాపారం చేయటానికి తీసుకొచ్చాడు. వాడి చదువుకోసమే కిడ్నీ లమ్ముకున్నామని వాడి కేం తెల్సు పాపం? తీరా చూస్తే కిడ్నీలు లేవు. వాడి ఆశలన్నీ అడియాశ లయ్యాయి. చివరకు వాడికి మిగిలినవి మన శాపనార్థాలూ, తిట్లే!"

"తల్లిదండ్రులను కన్నకొడుకులు ఎన్నో రకాలుగా మోసం చేస్తారు. కానీ 'కిడ్నీ సదువులు' సదివిన కన్నకొడుకులు ఈ రకంగా మోసం చేస్తారన్నమాట!"